సాక్షి
అనంతపురం
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



'రాప్తాడు'లో ట్రాఫిక్ మళ్లింపు

సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో రాప్తాడు మార్గంలో ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. IIలో



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/ 14.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

డీఆర్‌గా భార్గవ్ బాధ్యతల స్వీకరణ


డీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్)గా జి.భార్గవ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డీఆర్‌గా పని చేస్తున్న నాగభూషణం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వైఎస్సార్ జిల్లా డీఆర్‌గా పని చేస్తున్న పీవీఎన్ బాబుకు అనంతపురం డీఆర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లాలో రెగ్యులర్ డీఆర్ లేకపోవడంతో జి.భార్గవ్‌ను నియమిస్తూ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. భార్గవ్ గ్రూప్–1 అధికారి కావడంతో శిక్షణలో భాగంగా అనంతపురం జిల్లాలో మూడు నెలల పాటు జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా సైతం విధులు నిర్వహించారు. డీఆర్‌గా బాధ్యతలు తీసుకున్న భార్గవ్‌కు పలువురు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఖజానా ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి ఖజానా శాఖ ఉద్యోగులకు ఎన్నికల సంఘం మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి (ఏసీఈఓ) పి.కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్లకు సూచించారు.

ఆంధ్రా రంజీ జట్టుకు దత్తారెడ్డి


మచ్చా దత్తారెడ్డి

అనంతపురం: అనంతపురం జిల్లాకు చెందిన యువ క్రికెటర్ మచ్చా దత్తారెడ్డి ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు అధికారికంగా సమాచారమందించారు. 19 సంవత్సరాల 4 నెలల వయసులోనే రంజీ క్రికెట్‌కు ఎంపికైన తొలి రాయలసీమ క్రీడాకారుడిగా దత్తారెడ్డికి గుర్తింపు దక్కింది. అండర్–19లో ఆంధ్రా జట్టు తరఫున రెండు సెంచరీలతో 500 పరుగులు చేశాడు. వికెట్ కీపర్‌గా 20కి పైగా క్యాచులు పట్టి, స్టంపింగ్ చేశాడు. దేశంలోనే అత్యున్నత స్ట్రైకర్‌గా ఉన్న ఘనత దక్కించుకున్నాడు. ఆరేళ్లుగా అనేక ఏజ్ గ్రూపుల్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. విజయనగరంలో కేరళతో జరిగే ఆంధ్రా రంజీ మ్యాచ్‌లో మచ్చా దత్తారెడ్డి అరంగేట్రం చేయనున్నాడు. ఈ సందర్భంగా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మధుసూదనాచారి, సీనియర్ క్రికెటర్లు దత్తారెడ్డిని అభినందించారు.

రాయల పాలన అమోఘం


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి (చిత్రంలో) పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయల పాలన అమోఘమని పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల 553 జయంతి ఉత్సవాలను శుక్రవారం ఎస్కేయూలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మత సామరస్యం కోసం కృష్ణదేవరాయలు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ప్రజల బాగోగులు తెలుసుకునే అంశంలో రాయలు ప్రదర్శించిన నేర్పు ఎంతో గొప్పదన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తనకు మాతృమూర్తి వంటిదన్నారు. ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలనా దక్షుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు కీర్తిని కొనియాడారు. ఆయన స్మారకార్థంగా వర్సిటీకి శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టడం గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ కె.కృష్ణకుమారి, సదస్సు కన్వీనర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయల వేషధారణలో పలువురు విద్యార్థులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

సర్వం సిద్ధం



- 110 ఎకరాల్లో బహిరంగ సభ
- తుది దశకు చేరుకున్న వేదిక నిర్మాణం
- సీఎం జగన్ పర్యటనకు భారీ బందోబస్తు
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, కో ఆర్డినేటర్


రాప్తాడు ఆటోనగర్ వద్ద రూపుదిద్దుకున్న 'సిద్ధం' బహిరంగ సభా వేదిక

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాలూ కైవసం చేసుకునే దిశగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను కార్యోన్ముఖులను చేసేందుకు రాయలసీమ ప్రాంతానికి సంబంధించి ఈ నెల 18న జరిగే 'సిద్ధం' బహిరంగ సభకు రాప్తాడులో సర్వం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో అత్యంత భారీ బహిరంగ సభగా దీన్ని నిర్వహించేందుకు 110 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి లక్షల సంఖ్యలో పార్టీ కేడర్, అభిమానులు, ప్రజలు తరలిరానున్నారు. వీరందరికీ అవసరమైన తాగునీరు, వైద్యం తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఫ్యాన్ ఆకారంలో వాక్ వే

'సిద్ధం' బహిరంగ సభా వేదిక నిర్మాణం తుది దశకు చేరుకుంది. వేదిక ముందు పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ ఆకారంలో భారీ వాక్ వే రూపుదిద్దుకుంది. సభలో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించిన అనంతరం 'వాక్ వే' ద్వారా పార్టీ కేడర్ దగ్గరకు వెళ్లి ప్రత్యేకంగా పలకరించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. 110 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభా వేదికతో పాటు పదుల సంఖ్యలో గ్యాలరీలు నిర్మించారు. నియోజకవర్గాల వారీగా వచ్చే వారందరూ గ్యాలరీలకు చేరుకునేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణానికి వెనుక భాగంలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 25కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు.

ఏర్పాట్ల పరిశీలన

రాప్తాడు ఆటోనగర్ సమీపంలో 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం.. రాప్తాడు, అనంతపురం, ధర్మవరం ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కూడా వీరి వెంట ఉన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముఖ్య నేతలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు పూర్తిస్థాయిలో హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయిస్తున్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే యామినీ బాల, ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు చేపట్టాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ గౌతమి పోలీసు అధికారులను ఆదేశించారు. రాప్తాడులో హెలిప్యాడ్ స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ అన్బురాజన్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ప్రొటోకాల్ ప్రకారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీకి సూచించారు. హెలిప్యాడ్ స్థలంలో బారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.

సంయమనంతో విధులు నిర్వర్తించండి

సీఎం పర్యటన సందర్భంగా పోలీసు సిబ్బంది సంయమనంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. 'సిద్ధం' సభకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కేటాయించిన విధులను వారు సక్రమంగా చేపట్టాలని, సభకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే సభా ప్రాంగణం వద్దకు అనుమతించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.






ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తలశిల రఘురాం, చిత్రంలో ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి తదితరులు, సిద్ధమవుతున్న గ్యాలరీలు, సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన 'సిద్ధం' కటౌట్లు

చౌదరికి అసమ్మతి సెగ

- ఆయన అభ్యర్థిత్వాన్ని ఒప్పుకునేది లేదంటున్న నేతలు
- పవన్ కళ్యాణ్ వస్తే సీటు త్యాగం చేస్తానన్న ప్రభాకరచౌదరి
- త్యాగం చేయడానికి నీ సొత్తేమీ కాదంటున్న టీడీపీ శ్రేణులు
- వైకుంఠం పోటీచేస్తే మద్దతు లేదని తెగేసి చెప్పిన మైనార్టీలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. 2019లో ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయిన వైకుంఠం ప్రభాకర్ చౌదరికి ఇక్కడ అసమ్మతుల బెడద ఎక్కువైంది. సొంత పార్టీలోనే ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభాకర్ చౌదరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసినప్పుడు జరిగిన అవినీతిని ఆ పార్టీ నేతలే తిరగదోడుతున్నారు. ఆయనొక అవినీతిపరుడు, ఆయనకు మళ్లీ టికెట్ ఇస్తే ఇక్కడ పార్టీ నామరూపాల్లేకుండా పోతుందని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

సీటు త్యాగం చేయడానికి నువ్వెవరు?

జనసేనతో పొత్తులో భాగంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే తన సీటు త్యాగం చేసి.. ఆయన గెలుపునకు పాటుపడతానని ప్రభాకర్‌చౌదరి చెబుతున్నారు. పవన్ కాకుండా ఆ పార్టీ అభ్యర్థిని ఎవర్ని పెట్టినా మద్దతు ఇవ్వనని స్పష్టం చేశారు. దీనిపై ఆ పార్టీ నేతలే తీవ్రంగా స్పందిస్తున్నారు. 'త్యాగం చెయ్యడానికి, గెలిపించడానికి నువ్వెవ్వరు, ఇదేమైనా నీ తాత, తండ్రుల సొత్తు కాదు కదా' అని టీడీపీలో బలిజ సామాజిక వర్గానికి చెందిన మునిరత్నం మీడియా ముఖంగా దుయ్యబట్టారు. జనసేన తరఫున పోటీ చేయడానికి తాను రెడీగా ఉన్నానని, నీ మద్దతు తనకేమీ అక్కర్లేదని, నీ పేరు చెప్పుకుంటే అవినీతి తప్ప ఇంకేమీ గుర్తు రాదు అంటూ వ్యాఖ్యానించారు.

చౌదరికి మైనార్టీల సెగ

ఓటర్ల పరంగా ముస్లిం మైనార్టీల సంఖ్య ఎక్కువగా ఉన్న అనంతపురం అర్బన్‌లో ఆ వర్గం వారే నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్ చౌదరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తానే అభ్యర్థినని, మైనార్టీలు తన అభ్యర్థిత్వాన్ని కోరుకుంటున్నారని టీడీపీ నేత జకీవుల్లా అంటున్నారు. ఆయన రెండ్రోజులుగా నియోజకవర్గంలో కుక్కర్‌లు పంచుతున్నారు. మరోవైపు టికెట్ ఇప్పిస్తానని తనకు బాలకృష్ణ అభయమిచ్చారని, తానే అభ్యర్థినంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ ప్రచారం చేసుకుంటున్నారు. టీడీపీలో మరికొంత మంది మైనార్టీ నేతలు స్వయంప్రకటిత అభ్యర్థులుగా చెలామణి అవుతున్నారు. దీంతో ప్రభాకర్ చౌదరి అసమ్మతుల నుంచి ముప్పేట దాడి ఎదుర్కొంటున్నారు. మరోవైపు జనసేన నుంచి జేసీ దివాకర్‌రెడ్డి తనయుడు పవన్‌రెడ్డి తీవ్రంగా పోటీపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీన్నిబట్టి చూస్తే ప్రభాకర్ చౌదరి కథ ఈ ఎన్నికల్లో ముగిసినట్టేనని అంటున్నారు.

'గిరిజన గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం రూరల్: గుత్తి మండలం గొల్లలదొడ్డి(సేవాగఢ్) గిరిజన గురుకుల పాఠశాలలో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశాలు, వివిధ తరగతుల్లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదో తరగతిలో 80, ఆరో తరగతిలో 47, ఏడో తరగతిలో 20, తొమ్మిదో తరగతిలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో ఎస్టీ విద్యార్థులకు 75 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, ఏజెన్సీ ఎంప్లాయీస్ కోటా విద్యార్థులకు 3 శాతం సీట్లు కేటాయించామని వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులు ఏప్రిల్ 10 లోపు www.aptwgurukualm.ap.gov.inవెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 954265588, 9550655840, 8341603090 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు


వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముకేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ పకడ్బందీగా చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల అంశంపై సీఈఓ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమితో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్ పాల్గొన్నారు. సీఈఓ మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్‌లు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు తగినంత సిబ్బంది ఉండేలా చూసుకోవాలన్నారు.

చెక్‌పోస్టులు ఏర్పాటు చేయండి

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగానే కీలకమైన ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకోవాలని సీఈఓ ఆదేశించారు. ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీకి అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన పోలీసు అధికారులకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. సి–విజిల్, సువిధ వంటి మొబైల్ యాప్‌లపై ఎన్నికల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు.

పకడ్బందీ చర్యలు చేపట్టాం

ఎన్నికలకు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని సీఈఓకు కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్‌ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, చెక్‌పోస్టుల ఏర్పాటు, నోడల్ అధికారుల నియామకం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, తదితర అన్ని ఏర్పాట్లూ చేపట్టామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎస్‌ఏ శామ్యూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టవర్‌క్లాక్: రోడ్లు, భవనాల శాఖ ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో అవుట్‌సోర్సింగ్ విధానం ద్వారా వాచ్‌మెన్, ఆఫీస్ సబార్డినేటర్, శానిటరీ వర్కర్ల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 22 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అనంతపురంలోని రహదారులు, భవనాల శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం www.ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

నేటి నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను కొండపైకి చేర్చనున్నారు. 18న ఉదయం 8గంటలకు దేవరకొండపై విశేష పూజలు, హోమాలు నిర్వహించి ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పరణ చేయనున్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు పూల పల్లకీ సేవ ఉంటుంది. 19 నుంచి 23వ తేదీ వరకూ రోజూ రాత్రి 8 గంటలకు వరుసగా సింహ, శేష, హనుమ, గరుడ, శ్వేత గజ వాహన సేవలు ఉంటాయి. 24న వేకువజామున లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం, 11.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవ ఉంటుంది. మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు. 25న రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవలు, 26న ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు హంస వాహన సేవలు ఉంటాయి.



ఆర్ట్స్ కళాశాల మైదానంలో యోగాసనాలు

సూర్యదేవా.. నమోనమామి

అనంతపురం కల్చరల్: రథసప్తమిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాలు జరిగాయి. యోగా విశిష్టతను, సూర్యనమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వివేకానంద యోగకేంద్రం ఆధ్వర్యంలో తెల్లవారుజామున నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సామూహిక సూర్యనమస్కార యజ్ఞం నిర్వహించారు. సూర్యభగవానుని స్తుతిస్తూ సాగిన మంత్రాలకనుగుణంగా వందలాది మంది యోగా సాధకులు 108 సామూహిక నమస్కారాలు చేశారు. ముఖ్య అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకరరెడ్డి, వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు మెళవాయి రాజశేఖరరెడ్డి తదితరులు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఒత్తిడి నిండిన జీవితానికి యోగా మాత్రమే పరిష్కారమార్గమన్నా రు. రోజూ సూర్యనమస్కారాలు చేయడం వల్ల చక్కటి వ్యాయామంతో పాటూ రోగాలు దరిచేరవని మనసు ఉల్లాసంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు దివాకర్, మారుతీప్రసాద్, ఆంజనేయులు, కటకం కృష్ణవేణి, పీడీ శ్రీరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాప్తాడులో రేపు 'జగనన్న జయకేతనం'



ఆలమూరులో నాటికను ప్రదర్శిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న నవరత్నాల సేవల విశిష్టతను, అవసరాన్ని తెలియజేస్తూ పద్య నాటిక రూపంలో అనంత కళాకారులు అద్భుతంగా ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం రాప్తాడు జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభలో నాటికను ప్రదర్శించేందుకు కళాకారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు దక్షిణ భారతదేశ సాంస్కృతిక మండలి సభ్యుడు మైఖేల్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ప్రారంభమయ్యే వరకూ జగనన్న జయకేతనం పేరుతో నాటిక ప్రదర్శన ఉంటుఏందన్నారు.

అలరించిన నాటకం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆలమూరు గ్రామంలో శుక్రవారం అనంత రంగస్థల కళాకారులు ప్రదర్శించిన 'జగనన్న జయకేతనం' నాటిక ఆకట్టుకుంది. శ్రీకృష్ణదేవరాయలుగా రాజారెడ్డి, తిమ్మరసుగా వెంకటేష్, రాయల ప్రతినిధులుగా నరసింహులు, రమణ, రైతుగా దేవరపల్లి వెంకటేశ్, రైతు భార్యగా సరోజమ్మ, పాలేరుగా భీమలింగ, డప్పు అంజి తదితరులు పాత్రోచితంగా నటించి మెప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను చైతన్య పరిచేలా అద్భుత అభినయంతో నటీనటులు ఆకట్టుకున్నారు.

'అనంత నుంచే కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం'

అనంతపురం: కాంగ్రెస్‌తోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ అన్నారు. శుక్రవారం అనంతపురంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల శంఖారావం అనంతపురం నుంచే ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 26న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, మాణిక్యం ఠాగూర్ కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరా రెడ్డి తెలిపారు. త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టో కూడా విడుదల చేస్తామన్నారు. పోలవరం, రాజధాని, ప్రత్యేక హోదా అంశాలు మేనిఫెస్టోలో ఉంటాయన్నారు. ఇండియా కూటమితో కలిసి వచ్చే అన్ని పార్టీలతోనూ మాట్లాడతామన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి మునియప్పన్, పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, డాక్టర్ సాకే శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు

- ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాం, సహకరించాలి : అన్బురాజన్

అనంతపురం: ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాప్తాడు పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. వాహనదారులకు, ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించామని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. వాహనాల రాకపోకల మళ్లింపు ప్రదేశాలలో 'ట్రాఫిక్ డైవర్షన్' వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ పర్యటన రోజున పంగల్ రోడ్డు, కలెక్టరేట్, ముసలమ్మకట్ట, ఎన్టీఆర్ మార్గాలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అవకాశం ఉంటాయని, ఈ నేపథ్యంలో ఆయా మార్గాల్లోని స్థానికులు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యామ్నాయ రహదారుల ద్వారా గమ్యస్థానాలు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభకు తరలి వచ్చే వారి వాహనాలను నిలిపేందుకు మొత్తం 16 పార్కింగ్ పాయింట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాహనాలలో వచ్చిన వారు ఆయా పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచి కాలి నడకన సభా వేదిక వద్దకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.



ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే...

- బెంగుళూరు నుంచి అనంతపురం మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు (అత్యవసర సేవల వాహనాలు మినహా) శ్రీసత్యసాయి జిల్లా మామిళ్లపల్లి వద్ద మళ్లించారు. మామిళ్లపల్లి నుంచి కనగానపల్లి, నూతిమడుగు, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా బెంగుళూరు వైపు వెళ్లే వాహనాలను అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద మళ్లించారు. సోములదొడ్డి, తడకలేరు, గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, మామిళ్లపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాల్సి ఉంటుంది.
- చెన్నై, కదిరి వైపు నుంచి ఫంగల్ రోడ్డు మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకునే వాహనాలు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి వద్దనే మళ్లించారు. బత్తలపల్లి నుంచి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తి రోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాల్సి ఉంది.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా కదిరి, చెన్నై వైపు ప్రయాణించే వాహనాలను సోములదొడ్డి నుంచి తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి మీదుగా మళ్లించారు.

వాహనాల పార్కింగ్ పాయింట్లు ఇవే...

- చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలతో పాటు కదిరి ప్రాంతం నుంచి సిద్ధం సభకు వచ్చే వారు ఆటో నగర్ వెనుక, నాటుకోడి రెస్టారెంట్ వద్ద, రాప్తాడులోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం ఎదురుగా, రాప్తాడులోని సెరికల్చర్ కార్యాలయం సమీపంలో, రాప్తాడు రైల్వే ట్రాక్ వద్ద, గంగులకుంట రైల్వేగేట్ వెంచర్ సమీపంలో, ఫ్లై ఓవర్ సమీపంలోని డ్రిప్ ఫ్యాక్టరీ వద్ద, కందకూరు మార్గంలోని పార్కింగ్ పాయింట్లలో వాహనాలను నిలపాల్సి ఉంది.
- కర్నూలు, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల నుంచి వచ్చే వారు 44వ జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్, ఐచర్ షోరూం, గాయత్రి మిల్క్ డెయిరీ వద్ద వాహనాలను నిలపాల్సి ఉంటుంది.
- హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం వైపు నుంచి వచ్చే వారు 44వ జాతీయ రహదారిపై రాప్తాడులోని ఐచర్ షోరూమ్ ఎడమ వైపు, ఎన్‌హెచ్ 44 ఎదురుగా, ఆటోనగర్ అపోజిట్‌లో వాహనాలు నిలపాల్సి ఉంటుంది.
- వీఐపీల అన్ని రకాల వాహనాల కోసం రాప్తాడులోని వై జంక్షన్ సచివాలయం, గంగలకుంట రోడ్డులో కుడివైపున ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

కూడేరులో వరుస చోరీలు

కూడేరు: మండల కేంద్రంలో ఒకే రోజు వరుసగా ఐదు చోరీలు జరిగాయి. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడేరులోని బస్టాండ్‌కూడలిలో ఉన్న విజయ్ ఫొటో స్టూడియో తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ.1.20 లక్షలు విలువ చేసే కెమెరా, లెన్స్, బ్యాటరీలు అపహరించుకెళ్లారు. అనంతరం ఆ పక్కనే ఉన్న రామాంజినరెడ్డి జిరాక్స్ సెంటర్ తలుపులు తెరిచి రూ.8 వేలు నగదు, హొసూరు ప్రసాద్ నిర్వహిస్తున్న డిస్‌టీవీ దుకాణంలో రూ.6 వేలు, ఈడిగ గోపాల్ నిర్వహిస్తున్న కిరణా షాపులో రూ.250 అపహరించుకెళ్లారు. ఆ పక్కనే ఉన్న హరి మెడికల్ షాప్ గోదాము తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అయితే అక్కడ ఎలాంటి వస్తువూ అపహరణకు గురి కాలేదు. లక్ష్మీ మెడికల్ షాపు, విష్ణు సూపర్ స్టోర్ తాళాలు తీసేందుకు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో తమ వెంట తెచ్చుకున్న తాళాలగుత్తిని హొసూరు ప్రసాద్ దుకాణం వద్ద వదిలేసి వెళ్లారు. ఆయా దుకాణాల షట్టర్లు సగం మాత్రమే తీసి ఉండడం శుక్రవారం వేకువజామున గుర్తించిన టీస్టాల్ నిర్వాహకులు వెంటనే నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసి చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం కూడా ఈ దుకాణాలకు సమీపంలోని ఏడు దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కణేకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం జక్కలవడికి గ్రామానికి చెందిన చిన్న మల్లేష్ (35)కు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న మల్లేష్.. గురువారం సాయంత్రం కణేకల్లులోని రైస్ మిల్లులో పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. యర్రగుంట సమీపంలోకి చేరుకుంటుండగా నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రుడిని గమనించి వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం వేకువజాము 1 గంటకు ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌వైకేలో నేడు ఉపన్యాస పోటీలు

అనంతపురం కల్చరల్: జాతీయ యూత్ పార్లమెంటు ఫెస్టివల్ -24లో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు వర్చువల్ విధానంలో యువతకు ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యువకేంద్రం డీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'యంగ్ వాయిసెస్ ఎంగేజ్ అండ్ ఎంపవర్ ఆఫ్ నేషన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై ఉపన్యాసం ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువతీయువకులు అర్హులు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు 98498 71174లో సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా ఉట్ల పరుష

కుందుర్పి: లక్ష్మీ వెంకటేశ్వర రథోత్సవంలో భాగంగా శుక్రవారం చివరి రోజు ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. కొందరు యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడారు. చివరకు వినయ్ అనే యువకుడు ఉట్లమాను ఎక్కాడు. ఉట్లమాను ఎక్కిన యువకుడిని ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.



ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

ఘనంగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు

ప్రశాంతి నిలయం: చైనీస్ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతి నిలయం వేదికగా శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి ప్రారంభించారు. సాయికుల్వంత్ సభా మందిరంలోకి సత్యసాయి చిత్రపటాన్ని చైనీస్ సత్యసాయి భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత విద్వాంసుడు చాంగ్‌చూయ్ సెన్ నిర్వహించిన కచేరీ భక్తులను అలరించింది.

శతాధిక వృద్ధుడి మృతి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లకు చెందిన కుంభే పాళ్యం చిన్నఓబుళేసు (103) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి అక్కడకు చేరుకుని ఓబులేసు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చిన్న ఓబుళేసు (ఫైల్)

'పురం'లో ఐటీ దాడులు

- ప్రముఖ ఫైనాన్షియర్ అశ్విన్ ఇల్లు, కార్యాలయంలో సోదాలు
- రికార్డులు, పత్రాలు స్వాధీనం

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రముఖ ఫైనాన్షియర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి అశ్విన్‌పై ఆదాయపన్ను శాఖ అధికారులు వల విసిరారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటం, లెక్కల్లో చూపని రూ.కోట్ల ఆర్థిక లావాదేవీలపై సమాచారం అందడంతో శుక్రవారం మధ్యాహ్నం ఐటీ అధికారులు దాడులు చేశారు. ఆదాయపు పన్నుశాఖ కర్నూలు అసిస్టెంట్ జాయింట్ కమిషనర్ అనిష్క, స్థానిక ఐటీ అధికారి ప్రమిధ్ కుమార్, వారి సిబ్బంది మొత్తం 11 మంది రెండు బృందాలుగా విడిపోయి అశ్విన్ ఇంట్లో, అతని ఫైనాన్స్ కార్యాలయం శ్రీసద్గురు ఎంటర్‌ప్రైజెస్‌లో సోదాలు చేశారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి పొద్దు పోయే వరకూ సోదాలు కొనసాగాయి. సోదాల సమయంలోనే అశ్విన్ అస్వస్థతకు గురికాగా.. అధికారులు అతని కుటుంబ వైద్యున్ని పిలిపించి చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా అశ్విన్ ఇంటిపై, సద్గురు ఎంటర్‌ప్రైజెస్‌పై ఆదాయపన్ను శాఖ అధికారుల దాడుల సమాచారం పట్టణంలో దావానంలా వ్యాపించడంతో అతని వద్ద లావాదేవీలు, చిట్స్‌లో భాగస్వామ్యులుగా ఉన్న వారంతా అప్రమత్తమయ్యారు. తమ పేర్లు బయటకు ఎక్కడ పొక్కుతాయోనని బిక్కుబిక్కు మంటున్నారు.



సద్గురు ఫైనాన్స్‌లో తనిఖీలు

రూ.5 కోట్లయినా.. ఐదు నిమిషాల్లో రెడీ

అశ్విన్ జిల్లాలోనే పేరుగాంచిన ఫైనాన్షియర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి. చిట్ కంపెనీ నిర్వాహకుడు. రాయలసీమ జిల్లాల్లోని ప్రముఖ కంపెనీల యజమానులకు, వర్తకులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఫైనాన్స్ ఇవ్వడం అతని వృత్తి. రూ.5 కోట్లయినా 5 నిమిషాల్లో సమకూర్చగల సమర్థుడు. అప్పుకోసం వచ్చే వారి నుంచి భూములు, భవనాలు తాకట్టుగా ఉంచుకుని పెద్ద ఎత్తున అప్పులు ఇస్తుంటాడు. అంతేకాకుండా తన మిత్ర బృందంతో కలిసి రూ.కోట్ల వ్యవహారాలు సాగిస్తుంటారు. రూ.5 లక్షల మొదలు రూ.25 లక్షల వరకూ ప్రతి నెలా సుమారు రూ.50 కోట్ల వరకూ చీటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే హిందూపురంలోని బంగారం దుకాణదారులకు, పట్టుచీరల వ్యాపారులకు భారీ మొత్తంలో అప్పులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాలన్నింటిపైనా ఆదాయపన్ను శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

అనంతపురం సిటీ: స్థానిక రాజీవ్‌కాలనీ సమీపంలో మహదేవనగర్ వద్ద రైలు ఢీకొని సాకే రాముడు(83) మృతి చెందాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- ఉభయ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- కనుల పండువగా కల్యాణోత్సవం

ఉరవకొండ: సూర్యదేవ నమోస్తుతే అంటూ శుక్రవారం వేకువజాము నుంచే భాస్కరుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఉరవకొండ మండలం బూదిగవిలోని సూర్య దేవాలయం కిక్కిరిసింది. భక్తులు గంటల తరబడి పిల్లాపాపలతో వేచి ఉంటూ సూర్యభగవానుడిని దర్శించుకున్నారు. విశేష పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఛాయ, ఉష సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మహా గణపతి, నగవగ్ర, మృత్యుంజయ, ఆయుష్య హోమాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన సతీమణి భువనేశ్వరి, సోదరుడు వై.శ్రీనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ ధనుంజయ, ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, బెస్త, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు రమణ, గోవిందు, నాయకులు తిప్పయ్య, బూదగవి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం కావాలి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం అర్బన్: రైతుల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముందుగా మండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి మృతికి అధికారులు, సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. రైతుల నుంచి జొన్న, కంది పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఎంత పంట సేకరించారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌బీకేల్లో ప్రదర్శించాలన్నారు. ఆర్‌బీకేల్లో ఎరువుల బిల్లులు పెండింగ్ ఉంచకుండా ప్రతి వారమూ పరిశీలించాలని ఏడీఏలకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా బోరుబావుల కింద వరి, మొక్కజొన్న, తదితర అధిక నీటితో సాగు చేసే పంటలు వేయకుండా రైతులను చైతన్య పరచాలన్నారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ అమలుకు సంబంధించి పశుసంవర్ధక శాఖ జేడీ, ఇతర శాఖల అధికారులు తీసుకున్న చొరవను అభినందించారు. నార్పల, బుక్కరాయసముద్రం, యల్లనూరు, తదితర ఐదు మండలాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి పాలసేకరణ ప్రారంభమవుతుందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని మండలి సభ్యులకు సూచించారు. పాడి పోషణకు ముందుకు వచ్చే రైతులకు డీసీసీబీ ద్వారా రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలి సభ్యులు మాట్లాడుతూ.. అరటి పండిస్తున్న ప్రాంతాల్లో పాలీ హౌస్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, పౌర సరఫరాల సంస్థ డీఎం రవీంద్ర, సిరికల్చర్ అధికారి ఆంజనేయులు, ఇతర శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆలమూరు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పెద్దిరెడ్డి, వన్నూరమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- రేపటి నుంచి తొండపాడులో బొలికొండ రంగనాథుడి ఉత్సవాలు
- 24న రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయశాఖ

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ చేయనున్నారు. ఈ నెల 24న దేవేరులతో కలసి బ్రహ్మరథంపై శ్రీవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయ శాఖ అధికారులు పూర్తి చేశారు.

రెండు ఆలయాల సంగమం

తొండపాడులోని రంగనాథస్వామి ఆలయం రెండు భాగాలుగా కనిపిస్తుంది. గుత్తి పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో 67వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయానికి ఎదురుగా కొండపైన మరో ఆలయం ఉంది. కొండపైన ఉన్న స్వామిని బొలికొండ రంగనాథస్వామిగా భక్తులు కొలుస్తుంటారు. గ్రామంలోని ఆలయంలో వెలసిన రంగనాథుడు... మాణిక్యరంగనాథస్వామి పేరుతో శయన రూపంలో పూజలు అందుకుంటున్నాడు.



తొండపాడులోని రంగనాథస్వామి ఆలయం



రథోత్సవానికి సిద్ధమైన నూతన రథం

మహావిష్ణువు సేద తీరిన చోటు

తొండపాడులోని కొండపై వెలసిన బొలికొండ రంగనాథస్వామి క్షేత్రానికి పురాణ ఇతిహాసాల్లో ప్రత్యేక స్థానముంది. ఓ సారి మహావిష్ణువు భూలోక విహారం చేస్తూ ఈ ప్రాంతానికి చేరుకున్నప్పుడు ఇక్కడి ప్రకృతి రమణీయ దృశ్యాలను చూస్తూ కాసేపు విశ్రమించినట్లుగా చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో కొండ చుట్టుపక్కల ఆశ్రమాలను ఏర్పాటు చేసుకున్న మునిపుంగవులకు కొండపై దివ్యతేజస్సు కనిపించింది. దీంతో ఆ తేజస్సు ఎక్కడి నుంచి వస్తోందో తెలుసుకునేందుకు మునిపుంగవులు కొండపైకి చేరుకున్నారు. అక్కడ ఓ బండపై విశ్రమించిన శ్రీవారిని చూసి అనేక నామాలతో కీర్తించారు. మహర్షుల భక్తికి మెచ్చిన మహావిష్ణువు వరం కోరుకోమనడంతో ఈ కొండపై శాశ్వతంగా కొలువుదీరి తమకు సేవించుకునే భాగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. దీంతో మునిపుంగవుల కోరికను మన్నించి కొండపైన రంగనాథస్వామి రూపంలో కొలువుదీరినట్లుగా స్థల పురాణం చెబుతోంది. ఈ కొండపై తెల్లటి పొదలు (బొల్లి) వచ్చినట్లుగా ఉండడంతో బొలికొండ అని పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతున్నారు. దీంతో కొండపై వెలసిన స్వామిని బొలికొండ రంగనాథస్వామిగా పిలుస్తుంటారు.

18 నుంచి బ్రహ్మోత్సవాలు

బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 19న సింహవాహనోత్సవం, 20న శేషవాహనోత్సవం, 21న హనుమద్ వాహనోత్సవం, 22న గరుడవాహనోత్సవం, 23న గజవాహనం, కల్యాణోత్సవం, 24న రథోత్సవం, 25న పారువేట, అశ్వవాహనం, 26న వసంతోత్సవం, హంసవాహన సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. ఉత్సవాలు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని చర్యలూ తీసుకున్నట్లు వివరించారు. గుత్తి నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక 43, 46 డివిజన్లలో అధికారులతో కలిసి మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాల వద్ద డ్రైనేజీ బ్లాక్ కావడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించి అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డీఈ రవీంద్ర రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పెన్నోబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదు, మధు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కనగానపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని పలువురు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలగకుండా అందరూ కలసిమెలసి ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవి వద్ద బైండోవర్ చేయించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు సూచించారు. శుక్రవారం నగరంలోని అశోక్ నగర్‌లో జరుగుతున్న 'డ్రై డే' నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నీరు నిల్వ చేసుకునే డ్రమ్ములు, సిమెంటు తొట్టెలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పూల కుండీలు, ప్లాస్టిక్ పాత్రలను పరిశీలించారు. డెంగీ జ్వరం సోకి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి కోలుకుంటున్న అబ్దుల్ రిజ్వాన్ భార్య సబియాను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ట్యాంకులకు మూతలు ఉన్నాయా? లేదా అని చూశారు. దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్, పెద్ద దోమలను చంపడానికి ఇండోర్ స్పేస్ స్ప్రే, ఫాగింగ్ ఆపరేషన్ చేయించారా? అని వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శి సైరాభాను, ఆశాకార్యకర్త నాగమణి, మలేరియా విభాగం సిబ్బందిని ప్రశ్నించారు. వారం తర్వాత మళ్లీ లార్వా, దోమ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణ అధికారి కె. సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి కె. మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితాబాయి హాజరై, మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును నిస్పక్షపాతంగా వినియోగించుకోవాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులని, దేశ పాలన పటిష్టంగా ఉండాలన్నా, అభివద్ధి జరగాలన్నా ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుల్లయ్య, ఎంఈఓ వెంకటస్వామి, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రసూల్ పాల్గొన్నారు.

బండి పరశురామ్ బంధువులకు డబుల్ ఓట్లు



బి.యాలేరు, అనంతపురంలో రెండు చోట్ల ఒకే వ్యక్తులకు ఓటుహక్కు కల్పించిన దృశ్యం

ఆత్మకూరు: టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన బండి పరశురామ్ బంధువులకు డబుల్ ఓట్లను సృష్టించారు. బండి నాగలక్ష్మి, బండి జయలక్ష్మి, బండి ముసలప్ప, బి.భాగ్యలక్ష్మికి ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలోని బూత్ నంబర్ 29లో ఓటు హక్కు ఉన్నట్లు చూపిస్తోంది. మళ్లీ అదే వ్యక్తులకు అనంతపురం అర్బన్ రాంనగర్ పార్కు బూత్ నంబర్ 109లో ఓటు హక్కు నమోదైంది. తాము నిజాయతీ పరులమని చెప్పుకునే టీడీపీ నాయకులు డబుల్ ఓట్లు సృష్టించారు అంటూ సోషల్ మీడియాలో ఈ వార్త హల్‌చల్ అయ్యింది.

సర్కారు బడి.. వసతుల ఒడి

- 'నాడు-నేడు'తో పాఠశాలల అభివృద్ధి
- అమ్మ ఒడి ద్వారా ఉన్నత చదువుకు ప్రోత్సాహం
- జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుకతో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ఇంగ్లిష్ మీడియంతో విప్లవాత్మక మార్పులు



ఆత్మకూరులో నాడు-నేడులో భాగంగా రూ.కోటి నిధులు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనం

ఆత్మకూరు: గత ప్రభుత్వాల పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా సరైన పౌష్టికాహారం అందేది కాదు. అయితే సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు సాధ్యమని.. చదువుతోనే అనుకున్నది సాధించొచ్చని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఇంగ్లిష్ నేర్చుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేశారు.

జగనన్న వచ్చిన తరువాత ఇలా..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక కీలక మార్పులు తీసుకువచ్చారు, జగనన్న గోరుముద్ద ద్వారా మెనూ ప్రకారం రోజుకో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అదే విధంగా జగనన్న విద్యాకానుక ద్వారా నోట్ పుస్తకాలు, పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగ్ వంటివి అందిస్తూ విద్యార్థులకు అండగా నిలిచారు. నాడు-నేడు ద్వారా మండలంలో మొదటి విడతలో భాగంగా 15 పాఠశాలల్లో రూ.4.62 కోట్లు, రెండో విడతలో 20 పాఠశాలల్లో రూ.6 కోట్ల చొప్పున పాఠశాలల అభివృద్ధికి మొత్తం రూ.10.62 కోట్లు ఖర్చు పెట్టారు. అదే విధంగా అమ్మ ఒడి ద్వారా 2020-21లో 3,685 మంది విద్యార్థులకు గాను రూ.5,52,75,000, 2021-22లో 5,094 మంది విద్యార్థులకు రూ.7,13,16,000, 2022-23లో 3,798 మంది విద్యార్థులకు 5,31,72,000 నగదును విద్యార్థుల ఉన్నత చదువులకు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చాక బైజూస్ కంటెంట్‌తో 687 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.

ఆత్మకూరు మండలంలో పాఠశాలల అభివృద్ధి ఇలా..

నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి చేసిన ఖర్చు	రూ.10.62 కోట్లు
అమ్మ ఒడి ద్వారా లబ్ధి పొందిన విద్యార్థుల సంఖ్య	12,577
తల్లుల ఖాతాల్లో జమ అయిన మొత్తం	రూ.18 కోట్లు
ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థుల సంఖ్య	687



ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలలో బెంచీలపై కూర్చొన్న విద్యార్థులు

ఇంగ్లిష్ మీడియం భేష్



జగన్ సార్ వచ్చిన తరువాత జగనన్న విద్యా కానుక ద్వారా యూనిఫాం, షూ, బ్యాగ్, పుస్తకాలు ఇచ్చారు. అంతేకాకుండా డిజిటల్ బోర్డు ద్వారా పాఠాలు చెబుతున్నారు. గతంలో ఇంగ్లిష్ మీడియం లేదు. జగనన్న వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– జ్ఞాన ప్రసన్న, పదో తరగతి, ఆత్మకూరు

ట్యాబ్ ఇచ్చారు



మాకు ట్యాబ్‌ల ద్వారా బైజూస్ యాప్‌లో పాఠాలు చెబుతున్నారు. పాఠాలు ఎంతో బాగా అర్థం అవుతున్నాయి. ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కన్నా మేమే బాగా చదువుగలగుతున్నాం. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. జగనన్న గోరు ముద్ద ద్వారా రుచికరమైన పౌష్టికాహారం అందుతోంది.

– సమీహా, 9వ తరగతి, ఆత్మకూరు

ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



ఓట్ల కోసం చాలా మంది రాజకీయ నాయకులు రాజకీయాలు చేస్తుంటారు. కానీ పిల్లల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో సీఎం జగనన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఇంగ్లిష్ మీడియం తీసుకువచ్చారు. ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ తరగతులు చెబుతున్నారు. నా ఇద్దరు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నా.

– దామోదర్‌రెడ్డి, ఆత్మకూరు

మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు

అనంతపురం టవర్‌క్లాక్: తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి శ్రీకృష్ణ దేవరాయలు అని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 553వ జయంతి సందర్భంగా బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయం నుంచి నడిమివంక వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు మాట్లాడుతూ.. నాటి రాయలవారి ప్రజా పరిపాలన విధానం ఇప్పటికీ అత్యవసరమన్నారు. శ్రీకృష్ణదేవరాయలు రాజ్యపాలన సాంఘికంగా, రాజకీయంగా బలిజల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటారని కొనియాడారు. భారతదేశ చరిత్ర ఉన్నంత వరకూ కృష్ణదేవరాయల చరిత్ర ఉంటుందన్నారు. ఆనాడు రాయలసీమలో వజ్రాలు రాశులుగా పోసి అమ్మేవారన్నారు. ఆయన్ను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సవేరా ఆస్పత్రి సహకారంతో గుండె వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య, యువజన అధ్యక్షుడు రమేష్, నగర అధ్యక్షుడు బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు ధనుంజయ్, కిరణ్ కుమార్, విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర కార్యదర్శులు పాల్గొన్నారు.

'సిద్ధం' బహిరంగ సభ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు



ఆర్టీసీ బస్సుకు సిద్ధం స్టిక్కర్లను అతికిస్తున్న ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల



యర్రగుంటలో కార్యకర్తలను ఆహ్వానిస్తున్న దృశ్యం

రామగిరి: ఈనెల 18న రాప్తాడులో జరగనున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేద్దామని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నసనకోట, మాదాపురం, పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల శంఖారావంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం జరుగుతుందన్నారు. ఈ సభకు నియోజకర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు రాజేష్, సిద్ధన్న, రామ్మూర్తి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, జేష్ఠ్యరామయ్య, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాప్తాడు: ఈనెల 18న రాప్తాడు ఆటోనగర్ సమీపంలో జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, సిద్ధం సభ మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పిలుపునిచ్చారు. గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, పాలచెర్ల, భోగినేపల్లి, బుక్కచెర్ల, ప్రసన్నాయపల్లి, రాప్తాడు, బొమ్మేపర్తి, పుల్లలరేవు తదితర పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. సభకు తరలి రావాలని కోరారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు.

'సిద్ధం' సభకు తరలిరండి

అనంతపురం క్రైం: సిద్ధం సభను విజయవంతం చేయాలని ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణతో పాటు బస్సులకు సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన సందేశాన్ని ఇస్తారన్నారు. గతంలో జరిగిన రెండు సభల కంటే చాలా గొప్పగా ఈ సిద్ధం సభ ఉంటుందని తెలిపారు. ఎన్నికల పోరాటానికి మేము సంసిద్ధం అనేందుకు పార్టీ కేడర్‌తో పాటు ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటలోపు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. ఈ రాష్ట్రాన్ని రూ.లక్షల కోట్ల అప్పులతో అఘాతంలోకి నెట్టిన నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలు మెచ్చేలా ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదన్నారు. రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే వ్యక్తికి నేడు దిక్కులేకుండా పోయిందన్నారు. ఈ రాష్ట్రం ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు వరుసలో ఉంటారన్నారు. ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కుటుంబంపై ఉందన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయం



రాప్తాడురూరల్: వైద్య చికిత్సలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య



రాప్తాడు: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ గీతావాణి

రాప్తాడు: ప్రజారోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయమని ఎంపీడీఓ గీతావాణి పేర్కొన్నారు. శుక్రవారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ధృడ సంకల్పంతో వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల కోసం మరో అడుగు ముందుకేసి దేశ చరిత్రలో ఇప్పటి వరకూ ఎవరూ ఊహకు అందని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణి, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పుల్లయ్య మాట్లాడుతూ.. 437 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా 104 సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు నందకిషోర్, సంధ్య, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద శనివారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలపై జిల్లా జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.మాధవ, జిల్లా జేఏసీ చైర్మన్, కన్వీనర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, డి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీఓ ఉపాధ్యక్షుడు రవికుమార్, జమీలా బేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు శోభారాణి, లింగమేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్ బాబు, శింగనమల తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు అక్కులప్ప, శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ-సీహెచ్ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్షన్న, ఏపీ మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

18న 'దస్తర్ బంది'

అనంతపురం ఎడ్యుకేషన్: గార్లదిన్నె మండలం పెనకచర్ల డ్యాం సమీపంలోని మదరసా ఏ అల్ జామీయాతు హసన్‌లో ఈనెల 18న ఉదయం 9 గంటలకు 'దస్తర్ బంది' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన హజరత్ ముక్తి ఖలీల్ రెహమాన్, హైదరాబాద్ నుంచి మౌలానా ఇర్షాద్ అహ్మద్ సాబ్ బాఖవి హాజరవుతారని పేర్కొన్నారు. ఖురాన్ అభ్యసన పూర్తి చేసిన విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. ఇక్కడికి వచ్చేందుకు అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా బస్సులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీద్ ఎదురుగా రాజు రోడ్డులోని అల్ మదీనా బస్ ట్రావెల్స్ వద్ద ఉదయం 8 గంటలకు బస్సులు సిద్ధంగా ఉంటాయని వెల్లడించారు. ముస్లింలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

కమనీయం.. కల్యాణోత్సవం



టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పూజలు



నగరంలో ఊరేగింపుగా వెళ్తున్న శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: రథసప్తమి వేడుకలు శుక్రవారం ఆలయాల్లో ఘనంగా జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందూ ధర్మప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని శారదా మైదానంలో ఉదయం చిన్నారులతో సామూహిక యోగా చేయించారు. టీటీడీ ప్రతినిధులు పండిట్ వేణు, బాబు రథసప్తమి విశిష్టతను తెలియజేశారు. సామూహిక ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో బసవరాజ స్వామి నేతృత్వంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం సూర్యప్రభ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. అర్చకులు ఏఎల్ఎన్ హరికిషోర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, శివబాలయోగి ఆశ్రమం, శివకోటి తదితర చోట్ల రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి.



హెచ్చెల్సీ కాలనీలో శివపార్వతుల కల్యాణోత్సవం

'రైతులను మోసం చేస్తున్న ప్రధాని మోదీ'



రాప్తాడురూరల్: నిరసన తెలియజేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు



అనంతపురం సిటీ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ/అనంతపురం అర్బన్: దేశంలోని అన్ని వర్గాల ప్రజలను మోసగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దింపే వరకూ నిద్రపోమంటూ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ వద్దకు ర్యాలీ చేరుకుంది. అక్కడ కాసేపు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కర్షక, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం కార్యదర్శి బాలరంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ ప్రతినిధి ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతులను మోసం చేస్తున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో నిరసన చేపట్టారు. కార్మిక సంఘం నాయకుడు ఎం.నల్లప్ప అధ్యక్షతన జరిగిన బంద్‌లో జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సి మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.నాగరాజు మాట్లాడారు. దుర్మార్గమైన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు, సంజీవరెడ్డి, రామాంజనేయులు, బ్రహ్మయ్య, శివయ్య, ఉమామహేష్, మధు పాల్గొన్నారు.


డీఈఓను కలసిన ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా నూతన విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మిని శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. నరసింహులు, జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, అకాడమిక్ కమిటీ కన్వీనర్ పి. రవి, రాష్ట్ర కౌన్సెలర్లు రమణ తదితరులు ఉన్నారు.

రూరల్ మండలం ఇన్‌చార్జ్ ఎంఏఓగా సోమశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: రూరల్ మండలం వ్యవసాయ అధికారి (ఏంఏఓ)గా పి.సోమశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఎంఏఓ శశికళ గత నవంబర్‌లో ప్రసూతి సెలవులో వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న సాయిలక్ష్మి కూడా రెండు రోజుల కిందట 20 రోజుల సెలవు పెట్టారు. కీలకమైన రూరల్ మండల రైతులు ఇబ్బంది పడకుండా గార్లదిన్నె ఎంఏఓ పి.సోమశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరపు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...

పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...

పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వసారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి

పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360



శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.



డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయులను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.

సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.


మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్సికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.